

మన్యం బంద్ రేపు

మణిపూర్‌లో ఆదివాసీలపై హింసాత్మక దాడులను నిరసిస్తూ జిల్లాలో గురువారం పలు సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయి

8లో



పొంగిన వాగులు.. గెడ్డలు

జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పలు చోట్ల రహదారులు కోతకు గురయ్యాయి. పంటలు నీటమునిగాయి.

8లో



ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

జిల్లాలో గత మూడు నెలల కాలంలో బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు.

8లో

నవశకానికి నాంది



వేదికపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు విడదల రజని, బూడి ముత్యాలనాయుడు, అమర్‌నాథ్, సురేష్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మేయర్ హరివెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, రహేజా ప్రతినిధులు

- దక్షిణాదిలో అతి పెద్ద ఇనార్బిట్ మాల్‌కు భూమి పూజ
- ఏయూలో కీలక భవనాల్ని ప్రారంభించిన సీఎం
- నగరంలో మౌలిక సదుపాయాల కల్పనకూ బాటలు
- విశాఖ ప్రగతికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి నీరాజనం
- అడుగడుగునా అఖండ స్వాగతం

సాక్షి, విశాఖపట్నం: విశాఖలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవశకానికి నాంది పలికారు. కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు భూమి పూజ, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. తొలుత కైలాసపురంలో రూ.600 కోట్లతో రహేజా గ్రూపు నిర్మించనున్న ప్రఖ్యాత ఇనార్బిట్ మాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇందులో ఐటీ క్యాంపస్, స్టార్ హోటల్ వంటివి కూడా నిర్మిస్తారు. ఈ మాల్ అందుబాటులోకి వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎనిమిది వేల మందికి ఉపాధి లభించనుంది. సుమారు రూ.134.58 కోట్లతో జీవీఎంసీ చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు అదే ప్రాంగణం నుంచి సీఎం శంకుస్థాపన చేశారు. అక్కడ నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి రూ.129 కోట్లతో చేపట్టిన ఫార్మా ఇంక్యుబేషన్ సెంటర్, బయో మానిటరింగ్ హబ్ (ఎలిమెంట్), ఆల్గారిథమ్, ఆ–హబ్, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, ఏయూ అవంతి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనాలను ప్రారంభించారు. వీటి ద్వారా ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఏడు వేల మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇలా కార్యనిర్వాహక రాజధాని కానున్న విశాఖ నగరం అన్ని విధాలా మరింత అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల చేపట్టిన ప్రాజెక్టులన్నీ అందుబాటులోకి వస్తే విశాఖ రూపురేఖలు ఎంతగానో మారిపోనున్నాయి. మౌలిక సదుపాయాలు మరింతగా విస్తరించనున్నాయి. ఏయూలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల తీరుతెన్నులను వీసీ పీవీజీడీ ప్రసాదరెడ్డి సీఎంకు వివరించారు. ఏయూలోనూ విద్యార్థులు థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులతో స్వాగతం పలికారు. అందుకు ప్రతిస్పందనగా ముఖ్యమంత్రి తన కారు ఫుట్ రెస్ట్‌పై నిల్చొని విద్యార్థులకు అభివాదం చేశారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న రహేజా గ్రూప్ ప్రతినిధులు



అవంతి ఆక్వా కల్చర్ హబ్‌ను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఏయూలో ప్రాజెక్టులను రిమోట్ ద్వారా ప్రారంభిస్తున్న సీఎం జగన్



ఎలక్ట్రానిక్ పరికరాలను పరిశీలిస్తున్న సీఎం జగన్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు తరలివచ్చిన అభిమానులు



జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అభిమాన పూలవర్షం



పోర్ట్ ఆస్పత్రి వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్‌పై పూలవర్షం కురిపిస్తున్న ప్రజలు

విశాఖ పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మునుపటికి భిన్నంగా అపూర్వ స్వాగతం లభించింది. ఎయిర్‌పోర్టు నుంచి కైలాసపురం పోర్టు ఆస్పత్రి జంక్షన్ వరకు ఆయన ప్రయాణించిన వాహనంపై పూలవర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. అడుగడుగునా నీరాజనాలు పలికారు. విమానాశ్రయం నుంచి జాతీయ రహదారి వెంబడి కిలోమీటర్ల మేర మహిళలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు మానవహారంగా ఏర్పడి జై జగన్ ప్లకార్డులతో ఘనంగా స్వాగతించారు. తనకు స్వాగతం పలకడానికి వచ్చిన వారు, తన కోసం ఎదురుచూస్తున్న వారిని దృష్టిలో ఉంచుకొని సీఎం తన వాహనాన్ని ఆపిస్తూ వారికి అభివాదం చేస్తూ ముందుకు వెళ్లారు. ఉదయం 11.13 గంటలకు విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి నగరంలో అన్ని కార్యక్రమాలను ముగించుకుని తిరిగి మధ్యాహ్నం 2.28 గంటలకు తాడేపల్లికి విమానంలో పయనమయ్యారు. ముఖ్యమంత్రితో పాటు మంత్రులు బొత్స సత్యనారాయణ, విడదల రజని, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి విమానంలో విశాఖ వచ్చారు. సీఎంకు స్వాగతం పలికిన వారిలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ఆదిమూలపు సురేష్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ హరివెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, వంశీకృష్ణ శ్రీనివాస్, రవీంద్రబాబు, ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్‌కుమార్, ముత్తంశెట్టి శ్రీనివాస్, తిప్పల నాగిరెడ్డి, అదీప్‌రాజు, వైఎస్సార్ సీపీ ఉత్తర సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్‌వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులున్నారు.

న్యూస్‌రీల్

సీఎం దృష్టికి సమస్యలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ సుభద్ర

సాక్షి, పాడేరు: విశాఖలో మంగళవారం పర్యటించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మంగళవారం ఎయిర్‌పోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. మన్యంలోని వివిధ సమస్యలపై ఆమె వినతి పత్రం అందజేశారు. ముఖ్యమంత్రిని జెడ్పీ చైర్ పర్సన్ జె.సుభద్ర కూడా కలిసి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

'మత్స్య' సిరి



మత్స్యకారుడికి చిక్కిన భారీ చేప

ముంచంగిపుట్టు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మత్స్యగెడ్డలోకి వరద నీరు చేరడంతో గిరిజన మత్స్యకారుల పంట పండుతోంది. భారీ సైజులో చేపలు వలలకు చిక్కుతుండటంతో మంచి ఆదాయం పొందుతున్నారు. మంగళవారం మండలంలోని పెదగూడ పంచాయతీ గలగండ వద్ద మత్స్యగెడ్డలో 15 కిలోల బంగారు పాప మత్స్యకారుడు వి.బిసనాథ్ వలకు చిక్కింది. మార్కెట్లో కిలో రూ.300 చొప్పున 15 కిలోల చేపను రూ.4,500కు విక్రయించాడు. ఈ రకం చేప కేవలం వర్షాకాలంలో మాత్రమే లభ్యం కావడంతో కొనుగోలు చేసేందుకు పోటీపడుతున్నారు.

కొత్తపల్లి జలపాతం సందర్శన

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతాన్ని మంగళవారం పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సందర్శించారు. జలపాతం అభివృద్ధి పనులపై గిరిజన సంక్షేమశాఖ ఈఈ డీవీఆర్ఎం రాజు చర్చించారు. టీడబ్ల్యూ ఏఈ దేముడు, ఎకో టూరిజం మేనేజర్ నవీన్, సూపర్‌వైజర్ అభి పాల్గొన్నారు.

విస్తృత తనిఖీలు



వారపుసంతలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ సత్యనారాయణ

జి.మాడుగుల: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో మంగళవారం స్థానిక పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మండలంలో ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలు, పెట్రోల్ బంక్, విద్యుత్ సబ్ స్టేషన్, ప్రజా సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలు, వారపు సంతలోను తనిఖీ జరిపారు. డాగ్‌స్క్వాడ్‌తో సీఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ బలగాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులు సమాచారం అందించాలని కోరారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై విస్తృత ప్రచారం

- డీఈవో సలీంబాషా



ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో సలీంబాషా, అధికారులు

సాక్షి, పాడేరు: ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ సొసైటీ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని డీఈవో సలీంబాషా ఆదేశించారు. మంగళవారం తన కార్యాలయ ఆవరణలో ప్రచార పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఏడీ అప్పారావునాయుడు, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

59,380 మందికి పింఛను పంపిణీ

జిల్లాలో 48.37 శాతం నమోదు



దారెలలో వర్షంలో పింఛను అందజేస్తున్న వలంటీరు హనుమంత్

సాక్షి, పాడేరు: జిల్లావ్యాప్తంగా మంగళవారం వేకువజామునుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. ఒక పక్క ఈదురుగాలులతో వర్షం కురుస్తున్నా వలంటీర్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేపట్టారు. జిల్లాలో 1,22,768 మంది పింఛనుదారులు ఉండగా మంగళవారం సాయంత్రానికి 59,380 మందికి పింఛను సొమ్ము పంపిణీ చేయగా 48.37 శాతం నమోదైంది. వరద ప్రభావిత ప్రాంతాలైన ఎటపాకలో 61.84శాతం, చింతూరులో 38.35, కూనవరంలో 21.21, వీఆర్‌పురంలో 10.96శాతం మేర తొలిరోజు పింఛన్లు అందజేశారు. వరద ఉధృతి తగ్గిన నేపథ్యంలో బుధవారం నుంచి చింతూరు డివిజన్‌లో పింఛన్ల పంపిణీ వేగవంతం కానుంది. జిల్లాలోని అన్ని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు కూడా పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.

సర్పంచ్ కుటుంబానికి అండగా ఉంటాం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- పాడె మోసి, అంత్యక్రియలకు హాజరు
- తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేత



పాడెను మోస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు

హుకుంపేట: సర్పంచ్ పుష్పలమ్మ కుటుంబానికి అండగా ఉంటామని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం మండలంలోని బారమసి పంచాయతీ నీలంపుట్టులో ఆయన స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పుష్పలమ్మ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఆయన పార్థివదేహం వద్దకు వెళ్లారు. పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థిక సాయంగా రూ.10 వేలు అందజేశారు. సర్పంచ్ కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పార్టీ శ్రేణులతో కలిసి మౌనం పాటించారు. శ్మశానం వరకు పాడె మోశారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మండల సర్పంచ్‌లు ఆర్థిక సాయం అందజేశారు. మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, పార్టీ మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కొండలరావు, పలువురు సర్పంచ్‌లు, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు అపహరణ



మాచ్‌ఖండ్ వించ్ హౌస్ వద్ద విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టిన ప్రాజెక్టు అధికారులు

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం సమీపంలో ఉన్న వించ్ హౌస్ వద్ద విద్యుత్ తీగలు సోమవారం రాత్రి అపహరణకు గురయ్యాయి. ప్రాజెక్టులో పని చేస్తున్న ఉద్యోగులు నివాసం ఉండే ఒనకఢిల్లీలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో అధికారులు విద్యుత్ లైన్లు పరిశీలించారు. వించ్ హౌస్ నుంచి ఒనకఢిల్లీ వచ్చే కాపర్ విద్యుత్ తీగలను వించ్ హౌస్ వద్ద కత్తిరించి ఉండడాన్ని గమనించారు. సుమారు 450 మీటర్ల కాపర్ విద్యుత్ వైర్లు అపహరణకు గురైనట్టు గుర్తించారు. ఈ విద్యుత్ కాపర్ తీగల విలువ రూ.2 లక్షలు ఉంటుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఈ విషయంపై మాచ్‌ఖండ్ పోలీసు స్టేషన్‌లో ప్రాజెక్టు అధికారులు ఫిర్యాదు చేశారు. నూతన విద్యుత్ కాపర్ వైరును ఏర్పాటు చేసి ప్రాజెక్టు అధికారులు నివాసం ఉంటున్న ఒనకఢిల్లీలో విద్యుత్‌ను మంగళవారం సాయంత్రం ఏడు గంటలకు పునరుద్ధరించారు.

సహాయక చర్యలు ముమ్మరం

- ముంపు నుంచి బయటపడిన రహదారులు
- బురద తొలగింపు పనుల్లో అధికార యంత్రాంగం
- ఇళ్లకు చేరుకుంటున్న బాధితులు



రోడ్డుపై కుయిగూరు వాగు బురదను శుభ్రం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



చింతూరు ప్రాంతంలో రహదారిపై బురదను తొలగిస్తున్న బ్లేడ్ ట్రాక్టర్



సోకిలేరు వాగు వద్ద బురద తొలగింపు



మురుమూరు వద్ద కొట్టుకుపోయిన రహదారి

చింతూరు: గోదావరి, శబరినదుల వరద ఉధృతి పూర్తిస్థాయిలో తగ్గింది. రహదారులపై పేరుకుపోయిన బురద తొలగింపును బ్లేడ్ ట్రాక్టర్లతో అధికార యంత్రాంగం చేపట్టింది. ఫైరింజన్ ద్వారా నీటిని వెదజల్లి రహదారులను శుభ్రం చేస్తున్నారు. చింతూరు మండలంలో సోకిలేరు వాగు 13 రోజుల పాటు రహదారిపైనే నిలిచిపోవడంతో చూటూరు, నర్సింగపేట మధ్య హైలెవిల్ చప్టాపై సుమారు పడి అడుగుల మేర బురద మేట వేసింది.

రాకపోకలు ప్రారంభం

జాతీయ రహదారులపై వరదనీరు పూర్తిగా తగ్గడంతో మంగళవారం ఆంధ్రా నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు యథావిధిగా కొనసాగాయి.

- వరద పూర్తిగా తగ్గడంతో విలీన మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కేంద్రాలు, సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకున్న బాధితులు వరదనీరు తగ్గిపోవడంతో ఇళ్లకు చేరుకుంటున్నారు. సామాన్లను ఇళ్లకు తీసుకువెళ్తున్నారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణకు అధికారుల నియామకం

ముంపు గ్రామాల్లో పారిశుధ్య పనుల పర్యవేక్షణ నిమిత్తం చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలకు నలుగురు ఎంపీడీవోలను నియమిస్తూ కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. చింతూరుకు రంపచోడవరం ఎంపీడీవో హరికృష్ణ, ఎటపాకకు అడ్డతీగల ఎంపీడీవో బాపన్నదొర, వీఆర్‌పురానికి గంగవరం ఎంపీడీవో శ్రీనివాసరావు, కూనవరానికి రాజవొమ్మంగి ఎంపీడీవో యాదగిరేశ్వరరావును నియమించారు.

ఎటపాక: వరద తగ్గుముఖం పట్టడంతో రహదారులు బయటపడ్డాయి. మంగళవారం రవాణా సౌకర్యం మెరుగుపడింది. భద్రాచలం నుంచి కూనవరం వరకు అనేక చోట్ల రహదారిపై నిలిచిపోయిన ఒండ్రు మట్టిని అధికారులు డోజర్ ట్రాక్టర్ల సాయంతో తొలగిస్తున్నారు. మురుమూరు వద్ద గోదావరి వరద ప్రవాహ తాకిడికి రహదారి మొత్తం దెబ్బతింది. దీనిని సరిచేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ముంపు కారణంగా కొన్ని గ్రామాలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు. మండలంలో 142 మంది రైతులకు చెందిన 88 హెక్టార్లలో పత్తి పంట వరద ముంపునకు గురైనట్టు వ్యవసాయశాఖ అధికారుల ప్రాథమికంగా అంచనా వేశారు.

వ్యాధులు ప్రబలకుండా వైద్య శిబిరాలు

చింతూరు: వరదముంపు గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటుచేశామని ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే తెలిపారు. మంగళవారం ఆయన వీఆర్‌పురం మండలంలోని ముంపు గ్రామాల్లో పర్యటించి బాధితులకు నిత్యావసరాల పంపిణీపై ఆరా తీశారు. ప్రతీ కుటుంబానికి సరకులు అందేలా ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు.

బాధితులందరికీ సరకులు

వరద బాధితులందరికీ సకాలంలో నిత్యావసర సరకులు, కూరగాయలు అందేలా తగిన చర్యలు తీసుకోవడం జరిగిందని రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ తెలిపారు. మంగళవారం ఆయన కూనవరం మండలం పోలిపాక, టేకులబోరు, చినార్కూరు గ్రామాల్లో పర్యటించి సహాయక చర్యలను పరిశీలించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ జ్వరాలతో వచ్చిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని ఆదేశించారు. వరదల కారణంగా నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామన్నారు. తాగునీటి ఇబ్బందులున్న గ్రామాల్లో సౌకర్యం కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు.



పునరావాస కేంద్రం నుంచి ట్రాక్టర్‌పై సామాన్లను ఇంటికి తీసుకువెళ్తున్న బాధితులు



కూనవరం మండలంలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శుభం బన్సల్



వీఆర్‌పురంలో నిత్యావసర సరకుల సరఫరాను పరిశీలిస్తున్న పీవో సూరజ్ గనోరే

క్లుప్తంగా

నిబంధనలు పాటించకపోతే చర్యలు

● ఆర్టీవో రాజ్‌కుమార్



వాహన రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్టీవో రాజేష్‌కుమార్

అడ్డతీగల: వాహనచోదకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని రంపచోడవరం ఆర్టీవో రాజేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని వేటమామిడి జంక్షన్‌లో మంగళవారం ఆయన వాహనాలు తనిఖీ చేశారు. లైసెన్స్‌లు,సీబుక్‌లను పరిశీలించారు. రికార్డులు లేకుండా వాహనాలు నడుపుతున్న పలువురికి జరిమానా విధించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణాశాఖ నిబంధనలు పాటించని వాహనచోదకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘాట్ రోడ్డులో లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

మారేడుమిల్లి : మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో దుర్గమ్మ ఆలయం సమీపంలో మంగళవారం ఓ లోడ్ లారీ బోల్తాపడింది. రాజమహేంద్రవరం నుంచి చత్తీస్‌గఢ్‌కు లోడుతో వెళ్తున్న లారీ ఘాట్‌లో అదుపు తప్పి పక్కనే ఉన్న కల్వర్టుపై నుంచి దూసుకు వెళ్లి తుప్పల్లో బోల్తాపడింది. అక్కడ ఎటువంటి లోయ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు.

సచివాలయ సిబ్బందిపై కేసు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం సచివాలయం పరిధిలోని అవకతవకలపై పంచాయతీ కార్యదర్శి రజని ఫిర్యాదు మేరకు నలుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ సన్యాసినాయుడు మంగళవారం తెలిపారు. సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ సుధీర్, మహిళా పోలీసులు రాజేశ్వరి, వెంకటలక్ష్మి, వలంటీర్ నానాజీలపై కేసు నమోదు చేశామన్నారు. అనంతరం వీరికి 41ఏ నోటీసు ఇచ్చి స్టేషన్ బెయిల్ ఇచ్చామన్నారు.

పొంగిన వాగులు.. గెడ్డలు

- మన్యం అంతటా వర్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- కొట్టుకుపోయిన రహదారులు, కాజ్‌వేలు
- రాకపోకలకు ఇబ్బందులు



వరదకు కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు, కాజ్‌వే

సాక్షి, పాడేరు: జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.చింతూరు, పాడేరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. జిల్లా కేంద్రమైన పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, పెదబయలు, డుంబ్రిగుడ ప్రాంతాల్లో సోమవారం రాత్రంతా వర్షం కురుస్తూనే ఉంది. జి.మాడుగుల మండలంలో మత్స్యపురం–నుర్మతి వెళ్లే మార్గంలోని బొడ్డపుట్టు గ్రామం వద్ద గల కల్వర్టు కొట్టుకుపోయింది. బీరం, నుర్మతి పంచాయతీల్లోని ఖరీఫ్ వరినాట్లు ముంపునకు గురయ్యాయి.

రోడ్డుపైకి కొండ చరియలు

పాడేరు మండలంలోని వనుగుపల్లి పంచాయతీ మారుమూల చింతగున్నలకు పోయే రోడ్డుపైకి కొండచరియలు జారిపడడంతో గిరిజనులంతా భయాందోళన చెందారు. ఈరోడ్డులో రవాణా వ్యవస్థ నిలిచిపోయింది. మన్యంలోని ప్రధాన వాగులు, గెడ్డలలో వరద ఉధృతి నెలకొంది. మత్స్యగెడ్డ, వాగులు, గెడ్డలు ప్రమాదస్థాయిలో ప్రవహిస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. పాడేరు, అనంతగిరి, లంబసింగి, రంపుల, ధారకొండ ఘాట్‌రోడ్లలో ఈదురు గాలులకు ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

వర్షపాతం వివరాలు

జిల్లాలో అత్యధికంగా పాడేరులో 38.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా వి.ఆర్.పురంలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. హుకుంపేటలో 25.2,పెదబయలులో 22.8, వై.రామవరంలో 16.6, ముంచంగిపుట్టులో 15.6, చింతపల్లిలో 15.6, రాజవొమ్మంగిలో 12.2, జి.కే.వీధిలో 10.8, అరకులోయలో 10.2, అడ్డతీగలలో 6.6, కూనవరంలో 6.2, డుంబ్రిగుడలో 4.8, ఎటపాకలో 3.8, మారేడుమిల్లిలో 3.4, కొయ్యూరులో 3.2, అనంతగిరిలో 1.8, చింతూరులో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

జి.మాడుగుల: కుండపోత వర్షానికి గెడ్డలు, వాగులు పొంగి ప్రవహించాయి.వరద నీటి ప్రవాహానికి జి.మాడుగుల మండలంలోని మత్స్యపురం–బీరం రోడ్డులో కాజ్‌వే కొట్టుకుపోయింది. బొయితిలి, కిల్లంకోట పంచాయతీలకు చెందిన గ్రామాలమధ్య రాకపోకలు స్తంభించాయి. దిగరాపల్లిలో బట్టి గున్నమ్మకు చెందిన రేకుల ఇంటి గోడ కూలిపోయింది. నుర్మతి పంచాయతీ మద్దివీధి, గెమ్మెలి పంచాయతీ మద్దులబంద వర్షానికి కొంతమేరకు పంటపొలాలు కొట్టుకుపోగా, మరికొన్ని చోట్ల నీటమునిగాయి. సాడేక్ కాలనీ–బొంజంగి మార్గంలో కొంత అప్రోచ్ రోడ్డు, కాజ్‌వే కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రంలో జి.మాడుగులలో మెయిన్‌రోడ్డు జలమయమైంది. సంతబయలు, జి.మాడుగుల, అన్నర్లగెడ్డ ప్రాంతాల్లో పొలాలు నీటమునిగాయి.

ఉధృతంగా చాపరాయి

డుంబ్రిగుడ: మండలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి.చాపరాయి, సంపంగి, కోసంగి గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.



పాడేరు మండలం చింతగున్నల రోడ్డులో జారి పడిన కొండచరియలు



మద్దివీధి, మద్దలబంద గ్రామాల్లో ముంపునకు గురైన పంటపొలాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ

శిశుమరణాలు లేకుండా చర్యలు

చింతూరు: శిశు మరణాలు జరుగకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ జమాల్‌బాషా సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం చింతూరు ఐసీడీఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డకు పాలుపట్టే విధానంపై ప్రతి తల్లికి అవగాహన కల్పించేందుకు వైద్యశాఖ సిబ్బంది కృషి చేయాలన్నారు. జీరోడోస్ కంటిముందే ముర్రుపాలు పట్టాలని దీనిద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, సీడీపీవో విజయగౌరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా

మన్యం బంద్ రేపు

- ఆదివాసీ సంఘాల పిలుపు
- మణిపూర్ ఆదివాసీలపై దాడులకు నిరసన

సాక్షి, పాడేరు: మణిపూర్ రాష్ట్రంలోని ఆదివాసీలపై హింసాత్మక దాడులను నిరసిస్తూ మన్యంలోని గిరిజన సంఘంతో పాటు,ఆదివాసీ ప్రజాసంఘాలు ఈనెల 3న రాష్ట్రంలోని మన్యం బంద్‌కు పిలుపునిచ్చాయి. జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర మన్యం బంద్‌పై ఆదివాసీ ప్రజా సంఘాలన్నీ విస్తృత ప్రచారం చేస్తున్నాయి. జిల్లా కేంద్రమైన పాడేరులో పలు ఆదివాసీ సంఘాల ప్రతినిధులంతా బంద్‌పై బైక్ ర్యాలీ నిర్వహించి ప్రచారం చేశారు. బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఆదివాసీ ప్రజా సంఘాల నేతలు కోరారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్టు



అరెస్టు అయిన బైక్ దొంగలతో పాడేరు ఏఎస్పీ ధీరాజ్, సీఐ సుధాకర్, పోలీస్ సిబ్బంది

పాడేరు(రూరల్): అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, తదితర గ్రామాల్లో గత మూడు నెలల కాలంలో బైక్ దొంగతనాలు తరచూ జరగడం వల్ల పాడేరు ఏఎస్పీ బైక్ దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఇందులో భాగంతో సీఐ బి.సుధాకర్ అధ్వర్యంలో సీసీఎస్, పోలీస్ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి మంగళవారం ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొన్నారు. వారి వద్ద నున్న రూ.7.80 లక్షల విలువ గల 10 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పాడేరు ఏఎస్పీ ధీరజ్ స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జి.మాడుగుల మండలం కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి గ్రామానికి చిక్కుడు కామేశ్వరరావు, కొత్తపల్లి గ్రామానికి చెందిన సీదరి మహేష్ అలియాస్ నితిన్, జీకే వీధి మండలం మొండిగెడ్డ పంచాయతీ కొత్తవాడ గ్రామానికి చెందిన కొర్రా శ్రీను లను అరెస్టు చేసినట్టు తెలిపారు. చిక్కుడు కామేశ్వరరావుపై గతంలో నెల్లూరు జిల్లాలో రెండు మర్డరు కేసులు, రెండు బైక్ దొంగతనాలు, ఒక కారు దొంగతనం కేసులో అరెస్టై జువైనల్ హోమ్‌కి వెళ్లి తిరిగి వచ్చిన తరువాత మళ్లీ దొంగతనాలు చేయడం మొదలు పెట్టినట్టు ఆయన వివరించారు. ముగ్గురు వ్యక్తులపై జి.మాడుగుల, చింతపల్లి, కొత్తవలస పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయని తెలిపారు. ముగ్గురినీ అరెస్టు చేసి బైక్‌లు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపర్చి రిమాండ్ తరలించినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఐ సుధాకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పర్యాటకులను దోచుకున్న నిందితులపై కేసు

అరకులోయ టౌన్ : సుంకరమెట్ట సమీపంలోని గన్నెల జంక్షన్ వద్ద పర్యాటకులను బెదిరించి వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసిన వారిపై కేసు నమోదు చేసినట్టు అరకులోయ ఎస్‌ఐ ఆర్. సంతోష్ తెలిపారు. గతనెల 31వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో గన్నెల జంక్షన్ వద్ద ముగ్గురు వ్యక్తులు కాపు కాసి రాజమండ్రికి చెందిన ఇద్దరు పర్యాటకుల స్కూటీ ఆపి దౌర్జన్యంగా రూ. 9,500 వసూలు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. నిందితుల్లో ఒకరు అరకులోయ పోలీస్ సర్కిల్ పరిధిలోని డుంబ్రిగుడ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కృష్ణ ఎస్‌ఐ నంటూ, అరకులోయ మండలంలోని తురాయిగుడ గ్రామానికి చెందిన వైకుంఠరావు, బోసుబెడ గ్రామానికి చెందిన సమర్థి శేషగిరిరావులు కానిస్టేబుల్ అంటూ బెదిరించి డబ్బులు వసూలు చేసారన్నారు. బాధితుడు వి.దుర్గాప్రసాద్ అనే విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితుల కోసం గాలిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

నేటి నుంచి టేక్ హోం రేషన్

ఇంటి వద్దకే వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరకులు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్ద అందజేయడానికి సిద్ధం చేసిన సరుకులు

నక్కపల్లి : అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు జగనన్న ప్రభుత్వం సరఫరా చేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరుకులు నేటి నుంచి నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే తీసుకెళ్లి అందజేయనున్నారు. ఇప్పటి వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు వీరందరినీ పిలిచి పప్పు , కూరగాయలతో భోజనం వండి పెట్టి, కోడిగుడ్లు, పాలు ఇచ్చేవారు. మిగిలిన సరకులు ఇళ్లకు ఇచ్చేవారు. ప్రభుత్వం ఈ పథకాన్ని మరింత పక్కాగా అమలు చేయాలన్న ఉద్దేశ్యంతో ఆగస్టు నెల నుంచి నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణులు, బాలింతలకు నెలలో 25 రోజులకు సరిపడా పోషకాహారాన్ని ఇంటికే తీసుకెళ్లి అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. బియ్యం 3 కిలోలు, కందిపప్పు కిలో, పామాయిల్ 500 గ్రాములు, అటుకులు కిలో, రోడిపిండి కిలో, జొన్న పిండి కిలో, బెల్లం పావు కిలో, చిక్కి పావుకిలో, పాలు 5 లీటర్లు, కోడిగుడ్లు 25 చొప్పున ఒక కిట్‌గా ప్రత్యేకంగా ఒక సంచిలో ఉంచి వీటిని ఎండీయు(డోర్ డెలివరి) ఆపరేటర్ ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. పౌర సరఫరాల గోదాముల నుంచి ఈ సరకుల కిట్లను రేషన్ డిపోలకు చేర్చారు. వాటిని ఎండీయు ఆపరేటర్లు బుధవారం నుంచి గ్రామాల్లో గర్భిణులకు, బాలింతలకు అందజేస్తారు. పాయకరావుపేట నియోజకవర్గంలో నక్కపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో కోటవురట్ల, నక్కపల్లి, ఎస్.రాయవరం, పాయకరావుపేట మండలాల పరిదిలో 309 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 6వేలమంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. వీరందరికీ బుధవారం నుంచి నేరుగా ఇళ్ల వద్దకే తీసుకెళ్లి ఈ పోషకాహార సరకులు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్టు సీడీపీవో శ్రీవిద్య తెలిపారు.

వీడిన హత్య కేసు మిస్టరీ

- నిందితుడి అరెస్ట్
- సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గోవిందరావు

శృంగవరపుకోట(విజయనగరం జిల్లా): ఎస్.కోట పట్టణాన్ని మూడు రోజుల కిందట ఉలిక్కి పడేలా చేసిన స్థానిక చందన్ లాడ్జిలో మహిళ హత్య కేసు మిస్టరీ వీడింది. ఈ కేసుకు సంబంధించి మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ ఆర్.గోవిందరావు వివరాలు వెల్లడించారు. ఈనెల 30వ తేదీన ఎస్.కోటలోని చందన్ లాడ్జి మేనేజర్ గనివాడ శ్రీనివాసరావు లాడ్జిలో ఒక మహిళ మృతి చెందినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హత్య కేసుగా నమోదు చేశాం. రూమ్ నంబర్ 103లో మహిళ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం కోసం పంపామని చెప్పారు. తర్వాత విచారణలో మృతురాలు విశాఖ జిల్లా దేవరాపల్లి గ్రామానికి చెందిన ఆరిపాక ఈశ్వరమ్మగా గుర్తించామన్నారు. గత నెల 24న అరకు మండలం ఉరుముల గ్రామానికి చెందిన మాదాల శ్రీరాములు చందన్ లాడ్జిలో తమ విచారణలో రూమ్ బుక్ చేశాడని, ఆ వ్యక్తే హత్యకు పాల్పడినట్టు దర్యాప్తులో తేలిందన్నారు. నిందితుడు మాదాల శ్రీరాములును మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అరెస్టు చేశామని చెప్పారు. ఈశ్వరమ్మను ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం హత్య చేసినట్లు నిందితుడు శ్రీరాములు విచారణలో అంగీకరించాడని చెప్పారు.

డబ్బుల కోసం గొడవపడి..

పోలీసుల విచారణలో నిందితుడు మాట్లాడుతూ మృతురాలు ఈశ్వరమ్మ తనకు తెలుసని, ఆమెను లాడ్జికి తానే తీసుకెళ్లానని, తర్వాత డబ్బుల కోసం గొడవ పడ్డామని చెప్పాడు. ఆ గొడవలో తాను ఆమెను గోడకు గుద్దేయడంతో తలకు గాయమై పడిపోగా తర్వాత మెడకు చీర బిగించి హత్యచేసినట్టు చెప్పాడు. మరుసటి రోజు లాడ్జికి వచ్చి మృతురాలి వంటిపై ఉన్న నాలుగు బంగారు గాజులు, దుద్దులు, ఉంగరం తీసుకుని, ముత్తూట్ ఫిన్ కార్పొరేషన్ బ్యాంక్‌లో తాకట్టు పెట్టినట్లు చెప్పాడు. నిందితుడు ఇచ్చిన సమాచారంతో ముత్తూట్ బ్యాంక్ నుంచి 60 గ్రాముల బంగారం, నిందితుడి నుంచి రెండు మొబైల్స్, పల్సర్ బైక్, లక్ష రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ గోవిందరావు వివరించారు. హత్య కేసును ఛేదించిన సీఐలు, ఎస్సై ఇతర సిబ్బందిని డీఎస్పీ గోవిందరావు అభినందించారు. ఇలా ఉండగా ఈ హత్య కేసులో నిందితుడైన మాదాల శ్రీరాములు జనసేన పార్టీ నాయకుడని చెబుతున్నారు.



పవన్‌కల్యాణ్‌తో మాదాల శ్రీరాములు (నిందితుడు)

ముౌజియం నిర్మాణ పనులు వేగవంతం



మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

చింతపల్లి రూరల్: మండలంలోని తాజంగిలో నిర్మిస్తున్న గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియాన్ని మంగళవారం పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ పరిశీలించారు. నిర్మాణ పను లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. పనులు పూర్తయితే గిరిజనులకు మరింత ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పర్యాటకుల సంఖ్య కూడా ఏటా భారీ సంఖ్యలో పెరుగుతోందన్నారు. ఈఈ డీవీఆర్‌ఎం రాజు, డీఈ చాణక్య, జేఈ యాదకిషోర్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు పాఠాలు చెప్పిన జేసీ



9వ తరగతి విద్యార్థులకు గణితంలో సులభ పద్ధతులు వివరిస్తున్న జేసీ జాహ్నవి

- కోటవురట్లలో ఆకస్మిక పర్యటన
- రెవెన్యూ సిబ్బందితో సమీక్ష

కోటవురట్ల : జాయింట్ కలెక్టర్ జాహ్నవి కోటవురట్లలో ఆకస్మికంగా పర్యటించారు. తొలుత తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించిన ఆమె సుమారు గంట సేపు రెవెన్యూ సిబ్బందితో సమీక్ష చేశారు. సమగ్ర భూ సర్వేకు సంబంధించి జరుగుతున్న జాప్యంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన గ్రామాలలో త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దారు జానకమ్మను ఆదేశించారు. రాట్నాలపాలెంలో గెడ్డ పోరంబోకును కొందరు అక్రమించుకుని ఇళ్లు కట్టేశారని, దీనిపై స్పందనలో కూడా ఫిర్యాదు చేశామని నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు జేసీకి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి అక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారు జానకమ్మకు ఆదేశాలిచ్చారు. అక్కడి నుంచి స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు వెళ్లి పరిసరాలు, టాయిలెట్స్ పరిశీలించారు. విద్యార్థులు చేతులు కడిగే ప్రాంతంలో బురదమయంగా ఉండడంతో ఇలా ఉంటే మీరేం చేస్తున్నారంటూ ఎంఈవో–2 శ్రీ జోషను ప్రశ్నించారు. అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పరిశీలించి దీనిని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. స్లాబ్ లెవెల్ వరకు వచ్చాక ఆపేస్తే ఎలా పూర్తి చేయించండి అంటూ ఆదేశించారు. 9వ తరగతి గదిలోకి వెళ్లి ఆమె ఓ ఉపాధ్యాయురాలిగా మారిపోయారు. సిబ్బంది అందరినీ బయటకు పంపించేసి విద్యార్థులకు గణితం, సోషల్ సబ్జెక్టులలో పలు అంశాలు బోధించారు. బ్లాక్ బోర్డుపై గణితంలోని క్యూబిక్ చాప్టర్‌కు సంబంధించి సమస్యను రాసి ఎవరైనా పరిష్కరించాలని కోరారు. దాంతో ఓ విద్యార్థిని వచ్చి సమస్యను పరిష్కరించడంతో అభినందించారు. ఇలా సుమారు గంట పాటు విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సాధారణ పరిశీలనలో భాగంగానే వచ్చినట్టు తెలిపారు. జిల్లాలో సమగ్ర భూ సర్వే పారదర్శకంగా జరుగుతోందన్నారు. మాకవరపాలెం తహసీల్దారు కార్యాలయంలో రాత్రి సమయంలో విశ్రాంత ఉద్యోగితో రికార్డుల పరిశీలన విషయంపై వివరణ కోరగా దానిపై విచారణ చేస్తున్నామని, అక్రమాలు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. డీటీ సోమశేఖర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

తల్లిదండ్రులకు చెంతకు అదృశ్యమైన విద్యార్థి

అనకాపల్లి టౌన్: అదృశ్యమైన ఎనిమిదో తరగతి విద్యార్థి దరిమిశెట్టి అక్షయ్(14)ను పట్టణ పోలీస్‌లు అతడి కుటుంబ సభ్యులకు మంగళవారం అప్పగించారు. ఎస్‌ఐ దివాకర్‌యాదవ్ వివరాల మేరకు... మండలంలో తుమ్మపాల పంచాయతీ కొత్తపేట వీధికి చెందిన అక్షయ్ సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని అతడి తండ్రి గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తులో భాగంగా తుని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానంగా తిరుగుతున్న బాలుడ్ని పట్టుకుని విచారించగా, పూర్తి వివరాలు చెప్పడంతో అక్కడ పోలీసులు అనకాపల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతుడు శరగడం సాయి (ఇన్‌సెట్) ఫైల్

చోడవరం రూరల్: చోడవరం–అనకాపల్లి ప్రధాన రహదారిలో విశాఖ డెయిరీ బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రం వద్ద రోడ్డు ప్రమాదంలో గజపతినగరం గ్రామానికి చెందిన సాయి(22) మృతి చెందాడు. చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన శరగడం రామకృష్ణ కుమారుడు సాయి సోమవారం రాత్రి మోటార్ సైకిల్‌పై తన ఇంటి నుంచి చోడవరం బయలు దేరాడు. బల్క్ మిల్క్ కూలింగ్ కేంద్రం వద్దకు వచ్చేసరికి చోడవరం వైపు సైకిల్‌పై వెళ్తున్న లెక్కల అప్పారావు కుమారుడు రామారావును చీకట్లో గమనించే లోపు ఢీకొట్టాడు. దీంతో పట్టుతప్పిన సాయి మోటార్‌సైకిల్‌తోపాటు రోడ్డుపై పడిపోయాడు. ఈ ప్రమాదంలో సాయి తలకు తీవ్ర గాయమైంది. అతడిని చోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేసినప్పటికీ ఫలితం లేకపోయింది.

మృతిచెందిన సాయి పెదనాన్న కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎ.సూర్యనారాయణ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.